# సరళ చక్రరేఖ

అలసటగా ఉంది కాబోలు... వస్తూనే సోఫాలో వాలిపోయాడు చక్రధర్.

"ఏమండీ! పని ఒత్తిడి ఎక్కువైందా? అలా వాలిపోయారు?" మూసుకున్న కళ్ళమీద పెట్టుకున్న చేతిని అడ్డుతీసి కళ్ళు తెరిచిన అతనికి ఎదురుగా ఒక చేతిలో మంచినీళ్ళు, మరొక చేతిలో పొగలు క్రక్కుతున్న టీ లతో సరళ...

"అవును సరూ!" అంటూ లేని ఓపిక తెచ్చుకుని సోఫాలో సరిగా కూర్చుని భార్య అందించిన మంచినీళ్ళు తాగి, గ్లాసు ఆమెకు తిరిగి ఇచ్చి టీ అందుకున్నాడు.

అతను టీ త్రాగుతున్నంతసేపూ ఆమె అలా నిలబడే ఉండి, భర్తను తదేకంగా చూడసాగింది. అలా అతను అలసి వచ్చినపుడు తన ఒడిలోకి లాక్కుని చుంబనమాధుర్యం అందిస్తూ అతని అలసట పోగొట్టాలని ఆమె తపన.

అసలే పని ఒత్తిడితో అలసి యింటికి చేరిన భర్తను మరింత చికాకు పరచడం ఆమెకు ఇష్టం ఉండదు.

అంతలో ఏదో గుర్తుకు వచ్చినట్లు నిటారుగా అయి లేస్తూ టీ కప్పు, సాసరు సరళకందించాడు చక్రధర్.

"ఏమైందండీ?"

"రేఖా వాళ్ళింటికి వస్తానని చెప్పాను."

"యిపుడు అంత అర్జంటా?" అడిగింది సరళ గోముగా!

కొత్తపల్లి ఉదయ్‌బాబు

"రేపు సాయంత్రానికల్లా పెయింటింగ్ పూర్తి కాకపోతే ఇన్‌టైంలో కాంపిటీషన్‌కు పంపలేను సరళా! యించుమించు యివాళే ఆఖరి సిట్టింగ్. ఓకేనా?" అనేసి లేని ఉత్సాహం తెచ్చుకుని బైక్ కీస్ తీసుకుని హుషారుగా యీలవేస్తూ వెళ్ళి పోతున్న భర్తను చూసి "రాత్రికి చెప్తాను మీ పని" అనుకుంటూ లోపలకు నడిచింది సరళ.

* * *

జీడిపప్పు హల్వా, ఉల్లిపకోడీలు రెండూ చేసింది చక్రధర్ తిరిగి వచ్చేలోపల. అవంటే అతనికి చాలా యిష్టం. అందులో ఈ రోజుతో పెయింటింగ్‌కు యించుమించు ఫైనల్‌టచ్ యిస్తానంటున్నాడు. అతనికిష్టమైనవి తింటున్నప్పుడు అతని ఏకాగ్రత రెట్టింపు పెరిగి మరింత సిన్సియర్‌గా వర్క్ చేస్తాడు. అతను సంతృప్తి చెందేలా ఆ పెయింటింగ్ తయారుకావాలి. తప్పనిసరిగా బహుమతి రావాలి. అదీ తన ఆకాంక్ష.

ఆ కోరిక తీరాలంటే రేఖ సహకారం ఎంతైనా అవసరం.

ఎందుకంటే ఆ చిత్రానికి మోడల్ రేఖే కాబట్టి. చక్రధర్ ఇంటీరియర్ డెకరేటర్‌గా వర్క్ చేస్తున్నాడు. రేఖ అతని కొలీగ్.

రేఖ పుట్టింది, పెరిగింది, చదువు కొనసా

గించింది అంతా బెంగుళూరులోనే. చాలా మోడ్రన్‌గా, బెంగుళూర్ రోజ్‌గార్డెన్‌లో తాజాగా విరిసిన రోజాలా 'చమక్'మనిపించే సౌందర్య రాశి. ఆమె ఇంగ్లీషు అనర్గళంగా మాట్లాడుతూంటే ఎఱ్ఱని దానిమ్మ గింజ రంగులో ఉండే ఆమె అధరాల మధ్య సన్నజాజిరంగు కలిగిన తెల్లని పలువరుస కదలికల్లో సూదిమొనలాంటి పలుచని నాలుక దోబూచులాడుతుంటే ఎలాంటి వారైనా కనురెప్ప వేయడం మానేయాల్సిందే.

పూవికి తావి అబ్బినట్టు ఆ రూపానికి తగ్గ కంఠస్వరం... వింటున్నవారికి లైట్‌సెంటెడ్ స్మెల్‌లా ఓ రకమైన మత్తు కలిగిస్తున్నట్టుగా ఉంటుంది. అలాంటి ఓపెన్‌మైండెడ్ లేడీస్



సొసైటీలో చాలా అరుదుగా కనిపిస్తారు మనకు.

అంతటి అందగత్తె తన భర్త వేసే చిత్రానికి మోడల్‌గా ఉంటాననడం అదృష్టమే.

అసలు చక్రధర్ తననే మోడల్‌గా ఉండమన్నాడు.

తనే రేఖను ప్రపోజ్ చేసింది – అంతేకాదు స్వయంగా వెళ్ళి రిక్వెస్ట్ చేసింది కూడా.

"తిరిగే కాలు, తిట్టే నోరు ఒకచోట స్థిరంగా ఉండవంటారు. అయామ్ సారీ మేడమ్!" అంది గుప్పెడు మల్లెలు ముఖాన విసిరినట్టు.

"చక్రధర్‌ను మొదటిసారి నేను కలిసింది హైదరాబాద్‌లో జరిగిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో! మా చూపులు ఒక్కటి అయ్యాయి. మనసు విప్పి వివరంగా మాట్లాడుకున్నాకనే పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నాం. ఆయనలో అద్భుతమైన క్రియేటివిటీ ఉంది. పెళ్ళి పేరుతో అతనిలోని 'కళ'ను నిద్రపోనివ్వడం నాకు యిష్టం లేదు" అంది సరళ మృదువుగా.

"నాకన్నా ఒక్క రంగు తక్కువేమో గానీ మీకేం తక్కువ? నా అందం కన్నా మీలోని 'జీవకళ' నీటి అలలపై పడే సూర్యకాంతిలా ఝులక్‌ని యిస్తుంది చూసేవాళ్ళకి. మీరు నమ్మినా నమ్మకపోయినా యిది నిజం. చూసారా? నాకే కవిత్వం వచ్చేస్తోంది మిమ్మల్ని చూస్తుంటే..." అంది రేఖ.

"థ్యాంక్ యూ! ఇక ఆయన గీయదలుచుకున్న చిత్రం ఏమిటంటే – ఎన్నో భౌతిక వనరులుండి, ఆర్థికంగా, సామాజికంగా, వాణిజ్యపరంగా, సాంకేతిక విజ్ఞానంతో అభివృద్ధి చెందుతున్న మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి అరవైనాలుగు సంవత్సరాలవుతున్నా యిప్పటికీ కొన్ని గ్రామాలలో స్త్రీలు కట్టుకోవడానికి ఒంటినిండా బట్టల్లేని దుస్థితిలో బ్రతుకీడుస్తున్నారు. ప్రకృతి కొనసాగడానికి బీజక్షేత్రమైన స్త్రీ, ఒక అద్భుతమైన సౌందర్యరాశిగా అటువంటి వాతావరణంలో పుట్టినప్పుడు ఆమె స్థితి, మానసిక పరిస్థితిల మధ్య వ్యత్యాసాన్ని చిత్రించడమే ఆ చిత్రం లక్ష్యం. అందుకు మీరే తగినవారు. అందుకే మిమ్మల్ని యింతగా రిక్వెస్ట్ చేస్తున్నా!" అంది రేఖ సున్నితమైన చేతుల్ని మరింత సున్నితంగా పట్టుకుని.

"అతని 'చిత్రభావ నేపధ్యం' మీకు ఎలా తెలుసు?" ఆశ్చర్యపోతూ అడిగింది రేఖ.

"నేను అతని భార్యని అని మీరు మర్చిపోతున్నారు. నాకు పెయింటింగ్స్ అంటే వల్లమాలిన అభిమానం. అతనికి ఆ అయిడియా యిచ్చింది నేనే!" అంది సరళ.

"యిపుడు మిమ్మల్ని చూసి సాటి స్త్రీగా నిజంగా ఈర్ష్యపడుతున్నాను" అంది సరళ బుగ్గ చిన్నగా చిదుముతూ రేఖ.

"యిపుడు మిమ్మల్ని చూసి సాటి స్త్రీగా నిజంగా గర్వపడుతున్నాను" అదే మాడ్యులేషన్‌లో అంటూ రేఖ బుగ్గ చిదిమింది సరళ. అప్పుడే అక్కడ ఎర్రగా కందిపోయింది.

"ఎందుకు?" విచిత్రంగా ముఖంలో ప్రశ్నార్థక భావాన్ని పలికిస్తూ అంది రేఖ.

"మీరు అంగీకరించినందుకు!"

"అంత గొప్ప చిత్రానికి నేను మోడల్‌ని అవుతున్నందుకు నాకూ ఆనందంగా ఉంది" సుతిమెత్తగా సరళను కౌగిలించుకుంది రేఖ.

చిత్రం గీయడం ప్రారంభమై నెలరోజులైంది.

కంట్రీలెవెల్లో సెలక్టయితే ఇంటర్నేషనల్




లెవెల్‌కి 'ఎంట్రీ' ఉంటుంది.

మొదటి రోజు తాను డిజైన్ చేసిన డ్రస్ వేసి, ఒక అనాగరిక గిరిజన యువతి గెటప్‌లో చక్రధర్ ముందు నిలబెట్టి అడిగింది.

"ఎలా ఉంది – రేఖ?"

అతను "రేఖ వైపు ఆ క్షణంలో చూసిన 'మెరుపు చూపు'ను సరళ గమనించింది.

"వావ్! సుపర్బ్... సుపర్బ్ సరళా!" అంటూ సరళను ఒక్కసారిగా గట్టిగా కౌగిలించుకుని శబ్దం వచ్చేలా ఆమె మెడ ఒంపులో గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు చక్రధర్.

ఎదురుగా రేఖ ఉండగా అతనలా ప్రవర్తించడం సరళకు చికాకుగా అనిపించింది. అయినా అతను బాధపడితే చిత్రం ప్రారంభం చేసే మూడ్ చెదిరిపోతుందని "చక్రీ! ప్లీజ్ బిహేవ్ యువర్ సెల్ఫ్" అంది సిగ్గుపడి సర్దుకుంటూ.

ఆ క్షణంలో రేఖ కళ్ళలో మిణుగురు పురుగు మెరుపులాంటి ఈర్ష్య మెరిసి మాయమవడాన్ని కూడా సరళ టక్కున పట్టేసింది.

"ఏమైనా అవసరమైతే తప్ప, పని పూర్తయితేగాని బయటకు రాకు చక్రీ!" ప్లీజ్ కాన్‌సన్‌ట్రేట్ వాట్ యు వాన్ట్ టు ఎచీవ్!" ఆజ్ఞాపిస్తున్నట్లుగా అంది చక్రధర్‌తో.

"ఢెఫినెట్లీ సరూ! లోపల ఆమె... అయ్ మీన్ గ్రీన్ రూమ్ లోపల ఆమె, యింట్లో నువ్వు కో–ఆపరేట్ చేస్తానంటే నా పని మరింత తేలిక సుమా!" అన్నాడు నర్మగర్భంగా నవ్వుతూ.

చటుక్కున రేఖవైపు చూసింది సరళ.

ఆమె అదేమీ పట్టనట్టు స్టాండుకు అమర్చిన కాన్వాసు మీద తననెలా ఏఏ రంగులతో చిత్రిస్తాడో అన్నట్లు వాటిని పరిశీలిస్తోంది.

"ఒకే! లేనిపోని విషయాల మీదకు దృష్టి పోనీక ఏకాగ్రతగా పనిచేయి. ఏమైనా కావలిస్తే కాలింగ్ బెల్ నొక్కు!" అనేసి బయటకు వచ్చేసింది సరళ.

*   *   *

అది మొదలుకొని ఆఫీసులో యిద్దరికీ ఏ మాత్రం రిలాక్సేషన్ దొరికినా వెంటనే తనకు ఫోన్ చేయడం, పెయింట్‌పని కొనసాగడానికి అవసరమైన ఏర్పాట్లన్నీ తాను చూడటం, ఆ తరువాత ఆమెను తయారుచేసి అతనికి సహకరించడం సరళకు అలవాటైపోయింది.

వారం రోజుల్లోనే సీన్‌కి సంబంధించిన బ్యాక్‌గ్రౌండ్ చుట్టూ ఉండే ఎన్విరాన్‌మెంట్, మధ్యలో రేఖ రూపంలో గల యువతి ఆకృతి రూపురేఖలు 'వావ్' అనిపించే రీతిలో చిత్రీకరించాడు చక్రధర్.

ఉన్నట్టుండి పెయింటిగ్ పని మధ్యలో ఆపి, హఠాత్తుగా తన దగ్గరకు వచ్చేసేవాడు.

"యిలారా... నీకో అద్భుతమైన ఐడియా చెప్పాలి!" అంటూ బెడ్‌రూమ్‌లోకి లాక్కు పోయేవాడు.

"ఏమిటా అద్భుతమైన ఐడియా?" తాను ఉత్సాహంగా అతని కళ్ళల్లోకి అతనేం చెబుతాడా అని ఆతృతగా ఎదురు చూడబోయేటంతలో సున్నితంగా తన పెదవులు అందుకునేవాడు.

"అవతల గదిలో ఆ అమ్మాయి ఉంది" అనబోతూంటే –

"తన బోయ్‌ఫ్రెండ్‌తో మాట్లాడుతోంది. అంతే... నాకు మూడ్ వచ్చేసింది. ప్లీజ్ కాదనకు సరూ! అని మరో మాటకు అవకాశం యివ్వకుండా కేవలం అరగంట సమయంలో తనను స్వర్గధామంలో ఓలలాడించి తానా వివశత్వంలో ఉండగానే 'రేఖను అటెన్షన్‌లోకి తీసుకొస్తాను' అనేసి వెళ్ళిపోయేవాడు.

ఆమె హఠాత్తుగా వచ్చి తలుపు కొడుతుందేమో అని భయపడుతూంటే –

"ప్లీజ్ సరూ! చేసే ప్రతి పనిమీదా ఏకాగ్రత ఉంటే తప్పక సక్సెస్ అవుతుందని తమరి ఉవాచే కదా!" అనేవాడు.

"యిలాంటప్పుడా?" అని తానంటే...

"ఎలాంటప్పుడైనా సరే! నేను రాత్రి పన్నెండు గంటలవేళ ఆఫీసు పనిలో ఏకాగ్రతగా పని చేసుకుంటుంటే నన్ను మరులుగొలిపి, మతి పోగొట్టి, పని చెడగొట్టిన సందర్భాలు లేవా డాళింగ్!" అనేవాడు గారంగా.

"బాగా మాటలు నేర్చావ్!" అని తానంటే –

"యీ మాటలు నేర్చేలా నువ్వే నన్ను మార్చావ్!" అని ముక్కు పిండేవాడు.

"అంటే నేను బరితెగించినదాన్నా?" అన్న దానికి సమాధానంగా తన అడ్డంగా తిప్పుతూ "నో... నో... బ్రతకనేర్చినదానివి. అందుకే యింత అద్భుతంగా మాట్లాడగలవ్!" అనేవాడు.

తాను సిగ్గుపడి అతని వక్షంపై మత్తుగా వాలిపోయేది. కానీ అతను పెయింటింగ్ పని పూర్తిచేయడం కోసం లేచివెళ్ళిపోతూంటే తప్పనిసరై వెళ్ళనిచ్చేది.

ఆ విరహం ఎంతసేపు?... కొన్ని గంటలు మాత్రమే.

సంసారంలో స్త్రీకి అంతటి సంతృప్తి లభించడం కన్నా పరిపక్వత మరేముంది?

*   *   *

ఆ మరునాడే "సద్గురు – ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్" వారు నేషన్ వైడ్ పెయింటింగ్ కాంపిటీషన్ అండ్ బ్రేకింగ్ ది వరల్డ్ రికార్డ్ అనే కేప్షన్‌తో నిర్వహిస్తున్న పోటీలో అడల్ట్స్ విభాగంలో పోటీకి పెయింటింగ్‌ని పంపించాడు.

ఆ సాయంత్రం రేఖను ఇంటికి టీకి ఆహ్వా

నించారు సరళ-చక్రి దంపతులు.

ఎప్పుడూ మోడ్రన్ డ్రస్సుల్లో వచ్చే రేఖ ఆ రోజు కాటన్ శారీలో వచ్చింది. అదీ ఫుల్ వైట్ కలర్ శారీలో. గ్రీన్ కలర్ అంచు కలిగి బుటీల తో ఉన్న శారీలో రేఖ జగదేకసుందరిని తలపిం చేదిగా ఉంది.

"కేవలం మీ సహకారం వల్ల చక్రి కాంపిటీ షన్‌కి పెయింటింగ్ పంపగలిగాడు. అది బహు మతి పొందితే నిజంగా మీ క్రెడిట్టే అవుతుంది" అంది రేఖతో.

"ఐడియా మీది, మోడలింగ్ నాది. చెయ్యా డించిన నేర్పరితనం చక్రిది. నిజంగా దానికి బహుమతి వస్తే నాకూ చాలా సంతోషమే. ఒక గొప్ప పెయింటింగ్‌కి నేను మోడల్‌ని అయి నందుకు" అంది రేఖ నిగర్వంగా.

"థాంక్యూ రేఖా! మీరు కొలీగ్‌గా దొరకడం మావారి అదృష్టం. నాకు ఫ్రెండ్‌గా లభించడం నా అదృష్టం. అందుకు మీకో చిన్న బహుమతి" అంటూ రేఖ దగ్గరగా వచ్చి బుగ్గమీద ముద్దు పెట్టింది సరళ.

"బహుమతి అంటే యిదా? యింకా ఏదో ఖరీదైన గిఫ్ట్ అనుకున్నాను" అంది తేలికగా నవ్వేస్తూ రేఖ.

"అపుడే అయిపోలేదు. మాట్లాడుతూ ఉం డండి. యిపుడే వస్తాను" అంటూ లోపలకు వెళ్లింది సరళ.

మరో పది నిముషాల అనంతరం సరళ చేతిలో పళ్ళెంతో హాల్లోకి వచ్చేసరికి రేఖ లేదు.

"ఏం చక్రీ, రేఖ ఏది?"

"వెళ్ళిపోయింది..." అన్నాడు చక్రి సీరియస్‌గా ముఖం పెట్టి.

"ఏం? ఎందుకు?"

"టీ కి పిలిచాం, యిచ్చాం. తాగాక నువ్వు కబుర్లు మొదలెట్టావు. యింతలో తన బాయ్ ఫ్రెండ్ ఫోన్ వచ్చింది. వెళ్ళిపోయింది." చక్రి ముఖం ఎత్తి కళ్ళల్లోకి చూడకుండా మాట్లాడు తున్నాడంటే ఏదో జరిగింది. అది చెప్పాల్సింద యితే చక్రి దాచడు. అయినా యింక ఆమెతో పని ఏముంది? సహకారం అడిగాం. కో-ఆప రేట్ చేసింది. అంతే!

సరళ పళ్లెంతో లోపలకు వెళ్ళబోయింది.

చక్రధర్ ఆమె చెయ్యి పట్టి ఆపాడు.

"ఏమిటి?" అన్నట్టు చూసింది ఏ భావం లేకుండా.

"యిలా కూర్చో నీతో మాట్లాడాలి!"

"అర్జంటా?"

"అర్జంటే!" ఆమె చేతిలోని పళ్ళెం టీపాయ్ మీద పెట్టి ఆమెను తన ఒడిలో కూర్చోబెట్టుకు న్నాడు. ఆమెను రెండు చేతులతో బంధించి మెడవెనక గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు. అలాగే రెండు నిముషాలు ఉండిపోయాడు.

"సరూ! నీకు నేనంటే ఎందుకంత నమ్మ కం?"

"ఏ విషయంలో?"

"అన్ని విషయాలలోనూ. నేను నువ్వనుకు న్నంత మంచివాడిని కాను సరూ!"

"ఎందుకలా అనుకుంటున్నావు?"

అతను ఆమెను లేపి సోఫాలో ప్రక్కన కూర్చోబెట్టుకుని ఆమె ఒడిలో తలపెట్టుకుని పడుకున్నాడు.

"నిజం సరూ! రేఖ మా ఆఫీసులో చేరిన

కొత్తలో పెద్దగా నాకు ఏమనిపించలేదు. మిడ్డీలు, స్కర్ట్‌లు, జీన్ పాంట్లు, టీ షర్ట్‌లూ వేసి ఓవర్ సెక్సీగా కనిపించేది. కానీ నీ పరిచయం అయాక తన ప్రవర్తనతో పాటు మేనరిజమ్‌లో కూడా చాలా మార్పు వచ్చింది. వారంలో రోజూ కొత్త కొత్త డ్రస్సులతో ఆఫీసు అంతటినీ పిచ్చెక్కించేసింది. అందరితోనూ ఎంతో డిగ్నిఫైడ్‌గా ఉండే ఆమె నా రూమ్‌లోకొచ్చేసరికి ఎలాగోలా నన్ను లోబర్చుకోవాలి అన్నట్టుగా ప్రవర్తించేది.

ఆ ప్రయత్నంలో పమిట పదే పదే జార్చేసేది. లేకుంటే లోనెక్ మరీ సెక్సీగా కనబడేలా డ్రస్ చేసుకునేది. వెనకనుంచి నాకేదో వివరిస్తున్నట్టు నా గడ్డం తన చెంపకు రాసుకుంటూ వివరించేది. తన వక్షస్థలం నా వీపుకు తగిలేలా నిలబడేది. చాలా టెంప్ట్ అయిపోయేవాడిని. ఒకటి రెండు సందర్భాలలో ఆమె నడుము మీద చెయ్యి వేసేశాను కూడా.

అంతలోనే నీ ముఖబింబం గుర్తుకు వచ్చేది. చేయబోతున్న తప్పు ఛర్నాకోలాతో కొట్టినట్టు హెచ్చరించేది. అంతే... నేనే లేచి రూమ్‌లోంచి బయటకు వెళ్ళిపోయేవాడిని. అంతే కానీ నేను ఏనాడూ నీకు ద్రోహం చేయాలని, మోసం చేయాలని అనుకోలేదు.

నాకు అర్థంకానిదొక్కటే. పెళ్ళయిన ఆడది తన భర్తతో పరాయి స్త్రీ మట్లాడితేనే సహించదు. అలాంటిది నువు రేఖని నాముందు మోడల్‌గా నిలబెట్టి, మమ్మల్ని ఒంటరిగా వదిలిపెట్టి నిర్భయంగా నీ పనిలో నిమగ్నమయ్యేదానివి. ఏమిటి నామీద అంత నమ్మకం?"

సరళ తేలికగా నవ్వేసి అతని ముక్కు పట్టి వూపింది.

ఆపైన అతని పెదవుల్ని తన పెదవులతో సున్నితంగా స్పృశించింది.

"నమ్మకం నీమీద కాదు చక్రీ... నామీద!"

"నీమీదా?..."

"అవును... నేను నీకు యిన్నేళ్ళ మన సంసార జీవితంలో ఎటువంటి లోపం కలిగించకుండా ప్రవర్తించగలగడమే నా నమ్మకానికి కారణం. అనుక్షణం నీ ఆనందం కోసం ఆరాటపడ్డాను. నీకు ఎలా ఉంటే యిష్టమో అలా నన్ను నేను మలుచుకున్నాను. నా అలవాట్లు మార్చుకున్నాను. "నీకంటూ ఏ కోరికా లేదా?" అని నువ్వు అడగవచ్చు. ఉంది. మన యిద్దరం జీవితాంతం ఒకరినొకరం అపారమైన అనురాగంతో కలిసి జీవించాలనేది నా కోరిక. అందుకే మంచి చదువు చదువుకుని కూడా ఉద్యోగం వద్దనుకున్నాను. మన సంసారంలో అన్నీ 'మన' అనే నా భావన. 'నాది' 'నీది' వేరు వేరు అని నేను అనుకోవడంలేదు."

"కానీ నేను తప్పు చేయబోయానని చెప్పానుగా!"

"చేయబోయావేగానీ చేయలేకపోయావుగా! అది చాలు చక్రీ మన సంసారం స్వర్గమయం కావడానికి. నీ సుఖం నువు చూసుకునే వాడివే అయితే నాతో ఇప్పుడు ఈ విషయాలు చెప్పేవాడివే కాదు.

యిక నా సంగతి... నేను ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకోబోయే క్షణం వరకూ నేను ఏం చేస్తే, ఎలా చేస్తే నువ్వు ఆనందంగా ఉంటావా అని ప్రతి పనిలోనూ ఆలోచించి మరీ చేస్తాను. మనసుపెట్టి చేస్తానేమో అది తప్పక ఫలితాన్నిస్తుంది. యిదే నీ విషయంలో నా విజయ రహస్యం."

"రేఖ ఎందుకు వెళ్ళిపోయిందో తెలుసా?"




"తెలీదు చెప్పు! నాకు అనవసరం అయినా వింటాను."

"తాను ఈవేళ ఎలా ఉంది?"

"నా పరిచయంలో ఆమెను యింత అందంగా మరెప్పుడూ చూడలేదు."

"తనని మనసారా ఒక్కసారి అనుభవించమని కోరింది."

"నువ్వు ఏమన్నావ్?"

"మగాడివి కాదా అని రెచ్చగొట్టింది!"

"యింకా?'

"యింకా ఏముంది? అది నిర్ణయించడానికి నాకు తాళికట్టిన భార్య ఉంది. నువ్వు నిక్కచ్చి ఆడదానివే అని నిన్ను నమ్మగలిగిన మగాడు దొరికితే వెంటనే పెళ్ళిచేసుకో అన్నాను. ఒక బూతు మాట తిట్టి ఉక్రోషంగా వెళ్ళిపోయింది."

"వెంటనే నన్ను పిలవచ్చుగా! తనకోసం మంచి చీర కొన్నా. తెలుసా?"

"యీసారి వచ్చినపుడు తీసుకుంటుందిలే. అయినా మమ్మల్ని అలా వదిలేయడంలో నీ ఉద్దేశ్యం?"

"సదుద్దేశమే చక్రీ... నా ప్రత్యక్షంలో అయినా, పరోక్షంలో అయినా చక్రి నావాడు. అదే నా నమ్మకం. నమ్మకమే మన అనురాగ హృదయాల మధ్య పునాది. నాలో ఆ ఆత్మవిశ్వాసం పెరగడానికి రేఖ పరోక్షంగా సహాయపడింది కూడా. అందుకే రేఖలాంటి పిల్ల దొరికితే పెంచుకోవాలని ఉంది!"

"కని పెంచుకో..."

"ఎలా?" అంది విచిత్రంగా కళ్ళెగరేసి సరళ.

"యిలా!" అంటూ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు చక్రి.

తొందరలో ఒక బుల్లి రేఖ వారింట్లో నడయాడాలని కోరుకుందాం.